క్లుప్తంగా

17 నుంచి క్రికెట్ టోర్నీ

జూలూరుపాడు/సుజాతనగర్: ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని ఈ నెల 17 నుంచి జూలూరుపాడులో నిర్వహిస్తున్నట్లు జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మందా రంజిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, విజేతలకు వరుసగా రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేల నగదు బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. పేర్ల నమోదు కోసం 97014 48595, 83747 11432 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న విచారణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్, డీఈల అవినీతి ఆరోపణలపై అధికార పార్టీ కౌన్సిలర్లు చేసిన ఫిర్యాదుతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో విచారణ అధికారిగా నియమితులైన ఇరిగేషన్ ఈఈ అర్జున్ గత గురువారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి, క్వాలిటీ కంట్రోల్ టెండర్, డస్ట్‌బిన్లు కొనుగోలు చేసిన వివరాలను సేకరించారు. రెండు అంశాలకు సంబంధించిన రికార్డులను సోమవారం నాటికి మున్సిపల్ అధికారులు సమర్పించాల్సి ఉన్నా సమర్పించలేదు. ఈ విషయంపై విచారణ అధికారి అర్జున్‌ను వివరణ కోరగా రికార్డులు ఇంకా రాలేదని, వచ్చిన తరువాత పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈ జేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి నిర్వహించతలపెట్టిన సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం కొత్తగూడెం సర్కిల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోహన్‌రావు, ఎస్ఏఓ మురళి, డీఈ రవి, ఏఈలు రఘురామయ్య, సునీత, హేమంత్, నాయకులు గణేశ్, వెంకన్న పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని టేకులపల్లి సబ్ డివిజన్ నాయకులు హట్కర్ దేవా (ఏఈ), ప్రసాద్, జర్పుల రాజేందర్, దేవ్‌సింగ్, లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం టేకులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించాలి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సమస్యలు ఉన్నట్లు తేలిన వారికి ప్రభుత్వమే ఉచితంగా ఆపరేషన్లు చేయించాలని 10వ వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ కోరారు. వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరం సోమవారం ముగియగా ఆమె మాట్లాడారు. చూపు సమస్య ఉన్న వారికి అద్దాలు ఇవ్వడం హర్షణీయమే అయినా ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వం చేయించాలని కోరారు. వైద్యులు ఎల్.రాజేశ్వరి, టి.తరుణ్‌తో పాటు సిబ్బంది, నాయకులు శ్రీనివాసరావు, బి.తార, వి.కల్పన, బి.సరోజ, ఎం.కవిత, బి.జానకీ, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, జె.సుదర్శన్, బి.చందర్, జలీల్, సుభానీ, పాపారావు, ముద్దం మార్తమ్మ, శాంత, రాజయ్య, సందీప్, సలీం పాల్గొన్నారు.

భవనంపై దాడి గర్హనీయం

సింగరేణి(కొత్తగూడెం): ఇల్లెందులో చంద్ర కృష్ణమూర్తి (ఎల్లన్న) ట్రస్ట్ భవనంపై న్యూడెమోక్రసీ మధు తదితరులు ఈ నెల 7వ తేదీ రాత్రి దాడి చేయడం గర్హనీయమని ప్రజాపంథా నాయకులు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ భవనంపై దాడి చేయడమే కాక తాము దాడి చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు చంద్ర అరుణ, మాచర్ల సత్యం, జాటోత్ కృష్ణ, ఆజాద్, ధర్మ పాల్గొన్నారు.

అన్ని ఆస్పత్రుల్లో వైద్యం అందించాలి

కొత్తగూడెంఅర్బన్: రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అజరయ్య కోరారు. సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, ఆనంద్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి..

పాల్వంచరూరల్: కేటీపీఎస్ ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని బీజేపీ మండల కార్యదర్శి దాసరి రమేశ్, సేవాలాల్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ భద్రునాయక్ వేర్వేరుగా సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రుకు అందజేసిన వినతిపత్రంలో కోరారు.

కష్టాలు తీర్చే దారి ఏది?

- జీటీ రోడ్డు లేక అవస్థ పడుతున్న బోయితండా, పూబెల్లి ప్రజలు
- రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లు
- అటవీ శాఖ అనుమతులు లేక ముందుకు సాగని పనులు
- బ్యాంకులోనే మూలుగుతున్న రూ.5.30 కోట్ల నిధులు


రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న బోయితండా రహదారి

ఇల్లెందురూరల్: ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.. ఆ వెంటనే ప్రజాప్రతినిధులు శంకుస్థాపన కూడా చేశారు.. ఇంకేముంది తమ గ్రామాలకు రోడ్డు వచ్చేసినట్లేనని, ఇన్నాళ్లు పడిన కష్టాలు తీరినట్లేనని ప్రజలు సంతోషపడ్డారు. కానీ వారి ఆశ ఎక్కువ కాలం నిలవలేదు. అటవీ శాఖ అభ్యంతరాలు.. ప్రజాప్రతినిధులు, అధికారుల పట్టింపు లేనితనంతో పనులు ముందుకు సాగక నిధులు మూలుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల కష్టాలు తీరక ఇంకా ఎన్నాళ్లీ అవస్థలు అంటూ వారు ఆవేదనగా ఎదురుచూస్తున్నారు.

2020 అక్టోబర్ 7న శంకుస్థాపన

మండలంలోని బోయితండా, పూబెల్లి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కృషితో ప్రభుత్వం 2020 మార్చి 2న డీఎంఎఫ్ నిధుల నుంచి రూ.5.30 కోట్లు మంజూరు చేసింది. బోయితండా గ్రామపంచాయతీ పరిధిలో తుంటుబాలుతండా నుంచి పోచారంతండా వరకు రూ.3.40 కోట్లు, పూబెల్లి గ్రామ పంచాయతీలో పూబెల్లి నుంచి దండగుండాల వరకు రూ.1.90 కోట్లను రోడ్ల నిర్మాణానికి కేటాయించారు. అదే ఏడాది అక్టోబర్ 7వ తేదీన పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన సైతం చేశారు.

అటవీశాఖ కొర్రీలు

బోయితండా, పూబెల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ ప్రారంభించగానే అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు నిలిచిపోగా సర్పంచ్ బానోత్ సంతు తదితరులు ఎమ్మెల్యే హరిప్రియను కలిసి వివరించారు. ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో అటవీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. రహదారి నిర్మాణం వల్ల అటవీశాఖ కోల్పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా భూమి చూపించాలని, సంపద నష్టంపై జరిమానా చెల్లించాలని అటవీశాఖ నివేదికను సిద్ధం చేసి పంచాయతీరాజ్ అధికారులకు అందజేశారు.

స్థలం కేటాయింపులో తప్పిదంతో జాప్యం

పంచాయతీరాజ్ శాఖ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ అధికారులు ప్రత్యామ్నాయంగా సర్వే నంబర్ 225లో భూమిని అటవీశాఖకు అప్పగించారు. అయితే, ఆ స్థలం పనికి రాదని చెబుతూ ఇంకో స్థలం చూపాలని కోరారు. దీంతో రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 676లో భూమిని కేటాయించగా.. సంబంధిత భూమిని గతంలోనే భూపాలపల్లి జిల్లాలో రహదారి నిర్మాణం కోసం ప్రత్యామ్నాయంగా అప్పగించారని చెబుతూ ఫైల్‌ను వెనక్కు పంపారు. దీంతో రహదారి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

ముచ్చటగా మూడోసారి..

ఇటీవల మండలంలోని బోయితండా గ్రామపంచాయతీలో కలెక్టర్ అనుదీప్ పర్యటించిన సమయాన సర్పంచ్ రహదారి దుస్థితిని వివరించడంతో ఆయన రెవెన్యూ, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో చర్చించారు. ఈ మేరకు సర్వే నంబర్ 225లో భూమిని అటవీశాఖకు అప్పగిస్తూ పీఆర్ అధికారులు అటవీశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. అయితే, ఈ ఫైల్ ఇంకా పరిశీలనలోనే ఉండగా.. రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న ప్రక్రియకు ఈసారైనా మోక్షం లభించేనా? అని బోయితండా, పూబెల్లి ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మూడేళ్ల పాపను కోల్పోయాం



బోయితండా గ్రామపంచాయతీలో ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో సర్వేతండా గ్రామంలో మూడు నెలల చిన్నారిని కోల్పోయాం. రాత్రి వేళ ఆస్పత్రికి వెళ్లలేక ఉదయం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే పాప మృతిచెందింది. ఈ పరిస్థితి మరొకరికి ఎదురుకాకముందే అధికారులు బీటీ రోడ్డు నిర్మించాలి.

–జగదీశ్, సర్వేతండా, ఇల్లెందు మండలం

అటవీశాఖ అనుమతివ్వాలి



బోయితండా, పూబెల్లి గ్రామాల్లో బీటీ రోడ్డు నిర్మాణం కోసం అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రత్యామ్నాయ భూమి కేటాయింపులో జరిగిన తప్పిదంతో రెండున్నరేళ్లు వృథాగా గడిచిపోయాయి. కలెక్టర్ చొరవతో మూడోసారి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికైనా అటవీశాఖ అనుమతి ఇవ్వాలి.

–బానోత్ సంతు, సర్పంచ్, బోయితండా

ప్రతిపాదనలు పంపాం



అటవీశాఖ అభ్యంతరాల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు భూమిని చూపారు. రెండుసార్లు అభ్యంతరాలు ఎదురయ్యాయి. దీంతో తాజాగా మూడోసారి కలెక్టర్ ఆదేశంతో అటవీశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. త్వరలోనే రహదారి నిర్మాణానికి అనుమతి వచ్చే అవకాశముంది.

–రాజు, ఏఈ, పీఆర్, ఇల్లెందు మండలం

ఇంటింటికీ బీజేపీ కరపత్రాలు పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చుంచుపల్లి: పార్టీ పిలుపులో భాగంగా సోమవారం కొత్తగూడెంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీజేపీ ఓబీసీ జాతీయ మీడియా కోఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావుగౌడ్ ఇంటింటికీ పర్యటిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీల అభివృద్ధి కోసం అమలుచేస్తున్న పథకాలు, ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ అగర్వాల్, రాయుడు నాగేశ్వరరావు, నరేంద్రబాబు, చింతలచెర్వు శ్రీనివాసరావు, రవిగౌడ్, జల్లారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై స్పందించాలి



మాట్లాడుతున్న లిక్కి బాలరాజు

సింగరేణి(కొత్తగూడెం): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రభుత్వం స్పందించడంతోపాటు నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్‌లో విద్యార్థి నిరుద్యోగ మహాదీక్ష చేపడుతుండగా, సోమవారం ఆయన పట్టణంలోని టీచర్స్‌భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి భవిష్యత్‌ను ఆగమ్యగోచరంగా మార్చిందని ఆరోపించారు. కాగా, మంగళవారం హైదరాబాద్‌లో జరిగే దీక్షకు జిల్లా నుంచి నిరుద్యోగులు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు మందా నాగకృష్ణ, బుర్రా వీరభద్రం, బోడ అభిమిత్ర, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో కలెక్టరేట్’ను జయప్రదం చేయాలి

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్, ఇఫ్టూ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యాకన్న పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మాపురంలో సోమవారం ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొలతలతో సంబంధం లేకుండా ఉపాధి హామీ కూలీలకు రోజుకు కూలీ రూ.750 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎర్రయ్య, పాపారావు, ముత్తయ్య, రాములమ్మ, వీరభద్రం, బాలకృష్ణ, రత్నమ్మ, సుధాకర్ పాల్గొన్నారు.

చలివేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి


ప్రజలకు నీళ్లు అందిస్తున్న సీఐ కరుణాకర్

ఇల్లెందురూరల్: మండుతున్న వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుండాల సీఐ కరుణాకర్ అన్నారు. మండలంలోని కొమరారం గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు అవసరమైన మంచి కార్యక్రమాలు చేపట్టేదుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందువరుసలో ఉంటుందని తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నాళి కృష్ణవేణి, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, ఎస్ఐ శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధుల నియామకం


మాధవరావు

ఇల్లెందు: బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా పులిగళ్ల మాధవరావును జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఇల్లెందులో మాధవరావుకు ఎమ్మెల్యే హరిప్రియ, హరిసింగ్ నాయక్, దిండిగల రాజేందర్, శ్రీనివాసరెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు, శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, కోటేశ్వరరావు, శ్యామ్, శ్రీనివాస్, హరికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.


జేవీఎస్ చౌదరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా జేవీఎస్ చౌదరిని నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జేవీఎస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుకు కృతజ్ఞతలు తెలిపారు. జేవీఎస్ ఎంపిక పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు గర్హనీయం


మాట్లాడుతున్న హరిసింగ్‌నాయక్

చుంచుపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, తదితరులపై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని ఇల్లెందు మార్కెట్ మాజీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్ అన్నారు. విద్యానగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె తండ్రి సీతారాములుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని 137/1 సర్వే నంబర్ భూమి విషయంలో కోర్టులో కేసు నడుస్తుండగా, తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. సమావేశంలో బాదావత్ సీతారాములు, నాయకులు కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, అబ్దుల్ నబీ, ఉండేటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని నేత.. రజబ్‌అలీ


సింగరేణి: నివాళులర్పిస్తున్న నాయకులు

సుజాతనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు రజబ్ అలీ 27వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి భూక్యా దస్రు మాట్లాడుతూ సుజాతనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన రజబ్‌అలీ అన్ని వర్గాల ప్రజల మనసుల్లో తిరుగులేని నాయకుడిగా సుస్థిరస్థానం సంపాదించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, కొమారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యాలయంలో..

సింగరేణి(కొత్తగూడెం): ఆదర్శ కమ్యూనిస్ట్ నాయకుడు రజబ్ అలీ అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో రజబ్ అలీ వర్ధంతిని నిర్వహించారు. వై.శ్రీనివాసరెడ్డి, దమ్మాలపాటి శేషయ్య, లక్ష్మీనారాయణ, విజయలక్ష్మి, సోమయ్య, కారం రమేశ్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ రజబ్ అలీ 27వ వర్ధంతిని సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రజబ్ అలీ చిత్ర పటానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్కే నాగుల్‌మీరా, గుడిమెట్ల సీతయ్య, చెరుకుమల్ల రాజేశ్వరరావు, ఎస్కే చాంద్ పాషా, పగడాల అఖిల్, చెరుకుమల్ల రామకృష్ణ, అనుమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆత్మబంధువు కేసీఆర్


లబ్ధిదారులతో ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: రాష్ట్ర ప్రజల ఆత్మబంధువు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక వనమా స్వగృహంలో కొత్తగూడెం, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాలకు చెందిన 31 మంది పేద లబ్ధిదారులకు రూ.26.25 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వనమా పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరి సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, ఎంఏ రజాక్, అచ్చా నరేందర్, వీర్రాజు, కిరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

పల్లెల్లో రహదారులను మెరుగుపరుస్తాం..


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: పల్లెల్లో అంతర్గత రహదారులను మెరుగుపరుస్తామని, అందుకోసమే ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తున్నామని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో డీఎంఎఫ్ పథకం ద్వారా రూ.1.20 కోట్ల వ్యయంతో బీటీ, సీసీ రహదారుల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆజాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. మూడు నెలలుగా మండలంలో డీఎంఎఫ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాలలో భాగంగా మంజూరైన నిధులను పల్లెల్లో అంతర్గత రహదారులకు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావుతోపాటు దాస్యం ప్రమోద్‌కుమార్, యాకూబ్, గాజీ, కమల, శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, యలమద్ది రవి పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేరాఫ్‌గా నిలుస్తున్నదని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. రూ.5 కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించారు. చింతినిచెలకలో చలివేంద్రం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కంభంపాటి చంద్రశేఖర్, వీసం నీలమయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

పాల్వంచ: ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ మేడ్చెల్‌లో దక్షిణ భారత కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్వంచ ఎక్స్‌ట్రీం మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. కటాస్, స్పారింగ్ విభాగాల్లో జి.కార్తీక్‌వరుణ్, ఎండీ సాధిక్‌పాషా, నీల్‌సాగర్, తనూశ్, శ్రీలక్ష్మీజాహ్నవి, నిహాల్‌చౌదరి, షకీల్‌పాషా, వీరూక్షా, చేతన్, సాహస్, వర్షిత, ధనుష్, శ్రీవిద్య, దేవిప్రసాద్ పాల్గొని మూడు బంగారు పతకాలు, మూడు రజత పతకాలు, 12 కాంస్య పతకాలు గెలిచి సౌత్ ఇండియ చాంపియన్‌షిప్ సాధించారు. వారిని సోమవారం కోచ్ కోనే సూరిబాబు అభినందించారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: జేకే సింగరేణి బస్టాప్ మైదానంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 14న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జీఎం షాలేము రాజు సూచించారు. సోమవారం తన చాంబర్‌లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలుంటాయని, ఉద్యోగులు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ ప్రభాకర్‌రావు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, ఎస్ఈ ఆదినారాయణ, ఎస్సీ లైజనింగ్ అధికారి శ్రీనివాసరావు, ఉండం బ్రహ్మం, వి.కిషన్, రామారావు, మేకల శంకర్, లింగాల జగన్నాథం, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, ఈర్యా తదితరులు పాల్గొన్నారు.

నేడు పూలే జయంతి వేడుకలు

సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లెందులో ఘనంగా మహాత్మ జ్యోతీబా పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రెసిడెంట్ కోటా సాంబయ్య సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే హరిప్రియ, ఏరియా జీఎం షాలేమురాజు, గ్రంథలయ కమిటీ చైర్మన్ రాజేందర్, సింగరేణి అధికారులు, ఉద్యోగులు పంజాల శ్రీనివాసరావు, పులి పూర్ణచందర్‌రావు, ఎస్‌వీఎస్ఎన్ రాజు, గుర్రం శ్రీహరి ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ వ్యాన్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయాన వ్యాన్ పల్టీ కొట్టడంతో అందులో ఉద్యోగి కూడా గాయపడ్డాడు. ఎస్కార్ట్ వ్యాన్ సోమవారం సత్తుపల్లికి వెళ్లి వస్తుండగా, ఒంగోలుకు చెందిన సీఐఎస్ఎఫ్ ఉద్యోగి శ్రీనివాస్ విజయవాడ నుంచి భద్రాచలానికి బైక్‌పై వెళ్తూ రాంపురం బస్టాండ్ వద్ద ఎదురువచ్చాడు. వ్యాన్‌ను అదుపు చేసే క్రమంలో పల్టీ కొడుతూ శ్రీనివాస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ పక్కన కూర్చున్న జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్యకు స్వల్ప గాయాలు కాగా సింగరేణి ఆస్పత్రికి తరలించారు. అలాగే, శ్రీనివాస్‌ను ఒంగోలుకు తీసుకెళ్లినట్లు తెలిసింది.

కానూరికి ఘన నివాళులు

ఇల్లెందు: అరుణోదయ వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు 8వ వర్ధంతిని సోమవారం ఇల్లెందులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అజ్మీర బిచ్చా, చిన్నచంద్రన్న, రంగయ్య, చంద్ర అరుణ, కల్పన, దుర్గమ్మ, సావిత్రి, ముద్దా భిక్షం, జాటోతు కృష్ణ, మాచర్ల సత్యం, భాస్కర్, రాము, ప్రభాకర్, కిశోర్, వెంకన్న, రాజు, ఆజాద్, పృథ్వీ, సంధ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

టేకులపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టేకులపల్లి మండలంలోని శంభునిగూడెం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లుఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

‘పూలే జయంతి’ చైర్మన్‌గా రెడ్డిమళ్ల

పాల్వంచ: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఉత్సవ కమిటీ జిల్లా చైర్మన్‌గా పాల్వంచకు చెందిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమళ్ల వెంకటేశ్వరరావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని రెడ్డిమళ్ల వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.